క్లుప్తంగా

రైలుమార్గం ఏర్పాటుకు కృషి
ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తిరువూరు: దీర్ఘకాలంగా ప్రతిపాదనలకే పరిమితమైన కొండపల్లి–కొత్తగూడెం రైలు మార్గం నిర్మాణానికి కృషి చేస్తానని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం తిరువూరులో ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సమస్యను విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని చిన్ని దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన రైలు మార్గం నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. రైలుమార్గం ఏర్పాటైతే తిరువూరు ప్రాంతం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని చెప్పారు.

వాహన చోదకులకు పోలీసుల కౌన్సెలింగ్



తిరువూరు: మైనర్లు వాహనాలు నడిపితే చట్టప్రకారం తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని తిరువూరు సెక్టార్–1 ఎస్ఐ సత్యనారాయణ హెచ్చరించారు. తిరువూరులో ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించిన ఎస్ఐ ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్ బాలురకు కౌన్సెలింగ్ ఇచ్చారు. 18 సంవత్సరాలు నిండని వారు మోటారు వాహనాలు నడపరాదని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగినవారే వాహనాలు నడపాలని చెప్పారు. బోస్ సెంటర్, చీరాల సెంటర్లలో వాహనాల తనిఖీ జరిపి సరైన ధ్రువీకరణ పత్రాలు లేనివారికి జరిమానా విధించారు.

104 ఉద్యోగుల సమస్యలపై నిరసన



ఇబ్రహీంపట్నం: 104 వాహన సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఇబ్రహీంపట్నం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సందీప్‌కుమార్, జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు వారికి బాసటగా నిలిచారు. వారు మాట్లాడుతూ 104 సర్వీస్‌ను ప్రభుత్వమే నిర్వహించి ఉద్యోగుల బకాయిలు ఇప్పించాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా సర్వీస్ వెయిటేజ్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్, 104 ఉద్యోగుల యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి దుర్గాభవానీ, ఉద్యోగులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి విరాళాలు



తిరువూరు: స్థానిక జగన్నాథపురంలో పునర్నిర్మిస్తున్న దాసాంజనేయస్వామి ఆలయానికి పలువురు దాతలు ఆదివారం విరాళాలు అందజేశారు. ప్రవాసాంధ్రుడు పులిపాటి మణిరాం రూ.1.27 లక్షలు, ఆర్య వైశ్య సమాజం అధ్యక్షుడు గుడిమెట్ల మురళి రూ.21,110, దొడ్డా వీరరాఘవరావు రూ.10,116, మిరియాల శ్యామల రూ.10,051 విరాళాలను ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబు, నిర్మాణ కమిటీ సభ్యులు కొల్లిపర సుబ్బారావుకు అందజేశారు.

ట్రిపుల్ ఐటీలో స్వచ్ఛ భారత్



నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో ఆదివారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు క్యాంపస్‌లో స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో పెరిగిన పిచ్చిచెట్లను, చెత్తచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ శ్రావణి కనకకుమారి, ప్రోగ్రామ్ ఆఫీసర్లు వి.తులసి, జి.నిరంజని తదితరులు పాల్గొన్నారు.

నేడు ‘మీకోసం’

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమం నిర్వహిస్తామని ఆర్డీఓ మొవిడి వాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యలపై అధికారులు అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు.

అక్రమంగా నిల్వచేసిన ఉచిత ఇసుక స్వాధీనం

తిరువూరు: స్థానిక బైపాస్‌రోడ్డులో అక్రమంగా నిల్వ చేసిన ఉచిత ఇసుకను ఆదివారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సెక్టార్–1 ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. తిరువూరుకు చెందిన షేక్ సుబానీ ఇసుక విక్రయం నిమిత్తం నిల్వ చేసినట్లు అందిన సమాచారం మేరకు తనిఖీ నిర్వహించారు. రెవెన్యూ, పోలీసు అధికారులు జరిపిన తనిఖీలో 30 ట్రాక్టర్ల ఇసుక లోడును నిల్వ చేసినట్లు గుర్తించారు. ఇసుకను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని విచారణ చేస్తున్నారు.

నరకానికి నకళ్లు



గుళ్లపూడి రహదారిపై ఏర్పడిన గుంతలు



తోటమూల–గోసవీడు రహదారి దుస్థితి

- అడుగడుగునా గుంతలు
- అధ్వానంగా రహదారులు
- వాహనదారుల ఇక్కట్లు
- మరమ్మతులు చేయించాలని గ్రామస్తుల వినతి

గంపలగూడెం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. గతంలో రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరైనా అధికారులు సకాలంలో పనులు చేపట్టకపోవడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. గంపలగూడెం మార్కెట్ యార్డు నుంచి గుళ్లపూడి వరకు 6.8 కిలో మీటర్లు, తోటమూల మధిర క్రాస్ రోడ్డు నుంచి గోసవీడు వరకు 7.6 కిలో మీటర్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వాహనాల రద్దీ అధికంగా ఉండే ఈ రోడ్లపై గుంతలు పడి రాత్రివేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి.

ప్రమాదాలకు నెలవుగా..

తారు రోడ్లు ధ్వంసమై రాళ్లు లేచి కనీసం ద్విచక్ర వాహనాలు వెళ్లే వీలు కూడా లేని విధంగా రహదారులు మారాయి. గతంలో ఆర్ అండ్ బీ రోడ్లకు గుంతలు పడినప్పుడు తాత్కాలికంగా మరమ్మతులు చేసే అధికారులు ఇటీవల వీటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. ఊటుకూరు–ఎర్రమాడు ఆర్ అండ్ బీ రహదారి కూడా అడుగడుగునా గోతులమయమై ఆటోలు, ద్విచక్ర వాహనాలు సైతం నడవలేని పరిస్థితి నెలకొంది. గుంతలను తప్పించే క్రమంలో ఎదురెదురుగా వచ్చే వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నందున రాత్రి వేళ ప్రయాణమంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాలు పడినప్పుడు గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాలు అధికమవుతున్నాయి.

ముళ్ల కంపలతో మూసుకుపోయిన దారులు..

మండలంలోని పలు ఆర్ అండ్ బీ రహదారులు ఇరువైపులా ముళ్లకంపలు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి మలుపుల్లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు గ్రామీణ ప్రాంతాలతో పాటు ఖమ్మం జిల్లా జమలాపురం పుణ్యక్షేత్రానికి వెళ్లే యాత్రికులు గోసవీడు రహదారి అధ్వానంగా మారడంతో చుట్టూ తిరిగి వెళ్లక తప్పని పరిస్థితి నెలకొంది. తోటమూల–గోసవీడు రహదారిని డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయాలని చాలాకాలంగా ప్రజలు కోరుతున్నారు. కనీసం తాత్కాలిక మరమ్మతులు చేసి గోతులు పూడ్చాలని, జంగిల్ క్లియరెన్స్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారిని అభివృద్ధి చేయాలి



నిత్యం రద్దీగా ఉండే గోసవీడు ఆర్ అండ్ బీ రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఆంధ్రా, తెలంగాణలోని పలు ప్రాంతాలకు లింక్ రోడ్డుగా ఉన్నందున వెడల్పు చేయడంతో పాటు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– నాళ్ల చిన సత్యంబాబు, గోసవీడు

ప్రయాణమంటే హడల్



గుళ్లపూడి రోడ్డులో ప్రయాణమంటే వాహన చోదకులు హడలెత్తిపోతున్నారు. అడుగడుగునా గోతులు పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో జెడ్పీ రహదారిగా ఉండగా, అభివృద్ధి పేరుతో ఆర్ అండ్ బీకి అప్పగించినా ప్రయోజనం లేదు.

– కాసర వెంకటరెడ్డి, లింగాల

రూ.3.44 కోట్లు మంజూరు

గంపలగూడెం మండలంలో రహదారుల నిర్మాణం, మరమ్మతులకు రూ.3.44 కోట్లు మంజూరయ్యాయి. లింగాల రోడ్డుకు రూ.3 కోట్లతో పునర్నిర్మాణానికి ప్రభుత్వం అనుమతించింది. టెండర్లు పిలిచి త్వరలో పనులు ప్రారంభిస్తాం. గోసవీడు రహదారికి రూ.19 లక్షలు, ఊటుకూరు–ఎర్రమాడు రహదారికి రూ.25 లక్షలు మరమ్మతు పనుల నిమిత్తం కేటాయించారు. త్వరలో ఈ పనులు కూడా చేపడతాం.

– అచ్చారావు, ఆర్ అండ్ బీ ఏఈ, గంపలగూడెం

ఉద్యోగుల తొలగింపు యోచన విరమించాలి

పీఏసీఎస్ ఉద్యోగుల అసోసియేషన్ నేత రఘురాం

తిరువూరు: రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో 2019 తర్వాత నియామకం పొందిన ఉద్యోగులను తొలగించాలనే ప్రభుత్వ ప్రతిపాదనలు విరమించుకోవాలని ఏపీ పీఏసీఎస్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లినేని రఘురాం విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన తిరువూరులో విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగుల తొలగింపునకు ప్రభుత్వం నిర్ణయిస్తే ఆందోళన చేపడతామని చెప్పారు. ఉద్యోగులందరి సేవలు క్రమబద్ధీకరించి వారికి సర్వీసు రిజిస్టర్లు ప్రారంభించాలని కోరారు. ఉద్యోగుల పదవీ విరమణ కారణంగా ఏర్పడిన ఖాళీలను డీఎల్ఎఫ్‌సీ కమిటీ భర్తీ చేయాల్సి ఉన్నప్పటికీ ఆ ప్రక్రియ జరగకపోవడంతో సహకార సంఘాల్లో సిబ్బందిపై పనిభారం పెరిగిపోయిందని, ఈ కారణంగా నేరుగా నియామకాలు జరిగాయని రఘురాం తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణతో పాటు సహకార సంఘాల్లో వ్యాపారం పెరిగి సిబ్బంది కొరత ఉన్న కారణంగానే 2019 తర్వాత ఉద్యోగుల నియామకం జరిగిందని, వారిని తొలగించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు.

అనధికారికంగా ఇసుక డంపింగ్

తిరువూరు: భవన నిర్మాణ అవసరాలకు ఉచితంగా ఇసుక తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ఇస్తున్న అవకాశాన్ని కొందరు వ్యాపారంగా మలుస్తున్నారు. తిరువూరు పట్టణ పరిసరాల్లోని మామిడితోటల్లో పెద్దఎత్తున ఇసుక నిల్వచేసి ట్రాక్టరు ఇసుకను రూ.3 వేల చొప్పున విక్రయిస్తున్నారు. గానుగపాడు కట్టలేరు వాగులో ప్రతి రోజూ 500 నుంచి వెయ్యి ట్రాక్టర్ల ఇసుక తరలిస్తుండగా సగానికి పైగా అనధికారికంగా నిల్వ చేస్తున్నారు. ఉచిత ఇసుక తరలింపుపై రెవెన్యూ, పోలీసు శాఖల పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు వ్యాపారులకు ఇది కాసుల వర్షం కురిపిస్తోంది.



తిరువూరు సమీపంలోని మామిడితోటలో నిల్వచేసిన ఉచిత ఇసుక

1,000 మందికి వైద్య సేవలు

ముసునూరు: చెక్కపల్లికి చెందిన బౌద్ధమత శాఖ న–ఉయానా మోనాస్ట్రీ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం చెక్కపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించారు. శిబిరంలో ఏలూరు, భీమవరం, రాజమండ్రికి చెందిన ప్రముఖ అల్లోపతి, ఆయుర్వేదం, హోమియోపతి, మానసిక వ్యాధుల సంబంధిత వైద్య నిపుణుల బృందాలు 1,000 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. మెరుగైన వైద్యం, ఆపరేషన్లు అవసరమని గుర్తించిన వారిని ఏలూరు, రాజమండ్రి ఆస్పత్రులకు రిఫర్ చేశారు. చెక్కపల్లి, లోపూడి, గుళ్లపూడి, వలసపల్లి, గోగులంపాడు, అక్కిరెడ్డిగూడెం, సూరేపల్లి గ్రామాలకు చెందిన ప్రజలను వాహనాల ద్వారా రప్పించి, ఉచిత వైద్య సేవలు అందించామని కార్యక్రమ ఆర్గనైజింగ్ సభ్యుడు నండూరి మధుసూదన్ తెలిపారు.



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్య బృందాలు

కోడి పందేల స్థావరంపై దాడి

ఆగిరిపల్లి: మండలంలోని నరసింగపాలెం శివారులో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై ఎస్ఐ శుభశేఖర్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3,100 నగదును, ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశారు.

అందని పశు వైద్య సేవలు

చాట్రాయి: పశు వైద్యాధికారి లేక పశువులకు సరైన వైద్యం అందడం లేదు. మండలంలోని చనుబండ, చాట్రాయి, చిత్తపూరు గ్రామాల్లోని పశు వైద్యశాలల్లో సుమారు రెండేళ్ల నుంచి పశు వైద్యాధికారులను నియమించకపోవడంతో ఇన్‌చార్జి వైద్యాధికారులు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో పశువులకు అత్యవసర వైద్య సేవలు అందడం లేదని పశు పోషకులు వాపోతున్నారు. మండలంలో సుమారు 2,555 ఆవులు, 24,649 గేదెలు, 17 వేల గొర్రెలు, 10,136 మేకలు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. సీజనల్ వ్యాధులు వ్యాపించినప్పుడు పశు వైద్యాధికారి పర్యవేక్షణలో పశువులకు వెద్య సేవలు అందించాలి. పశువులు ఏదైనా ప్రమాదంలో చనిపోయినప్పుడు పోస్టుమార్టం నిర్వహించాలి.

ఇటీవల కురిసిన వర్షాలకు కోటపాడు, చీపురుగూడెం గ్రామాల్లో పశువులు ఎక్కువ రోజులు బురదలో తిరగడం వల్ల కాళ్లు పగిలి పుండ్లు పడ్డాయి. అసిస్టెంట్ వెటర్నరీ సిబ్బందితో తాత్కాలికంగా వైద్య సేవలు అందించారు. ఇప్పటికైనా పర్మినెంట్ పశు వైద్యాధికారులను నియమించాలని మండల పశు పోషకులు కోరుతున్నారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం



రమణక్కపేట(ముసునూరు): కలిసి చదువుకొని స్నేహపూర్వకంగా మెలిగి, నేడు వివిధ స్థాయిల్లో స్థిరపడిన మిత్రులు స్నేహ బంధాన్ని, ఆత్మీయతను మరోసారి గుర్తు చేసుకోవడం అభినందనీయమని ఎంపీపీ కొండా దుర్గాభవాని అన్నారు. రమణక్కపేట జెడ్పీ హైస్కూల్ ప్రస్తుత హెచ్ఎం రామకృష్ణారావు అధ్యక్షతన 1989–1990 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు తమ గురువులతో కలిసి ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎంపీపీ, గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాఠశాలకు ఇనుప బీరువాను హెచ్ఎంకు అందజేశారు. నాటి హెచ్ఎం కేవీఎస్ఆర్ ప్రసాదరావు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాల్‌కు స్థలం వితరణ

విస్సన్నపేట: విస్సన్నపేట మండల విశ్వబ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 13 సెంట్ల స్థలాన్ని తాతకుంట్ల మాజీ సర్పంచ్, లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు ఎన్‌టీ వెంకటేశ్వరరావు స్వచ్ఛందంగా రిజిస్ట్రేషన్ చేసి స్థలం పట్టా కాగితాలను విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులకు ఆదివారం అందజేశారు. గతంలో విశ్వబ్రాహ్మణ సంఘం సమావేశంలో కమ్యూనిటీ హాల్ లేకపోవటంతో పడుతున్న ఇబ్బందిని నాయకులు తన దృష్టికి తీసుకు రావడంతో స్థలం ఇస్తానని ఇచ్చిన హామీ మేరకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఇచ్చామని స్థలదాత వెంకటేశ్వరరావు తెలిపారు. దాతను సంఘ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు నెక్కళపు వెంకటేశ్వరరావు (బద్దే), చలసాని వెంకటేశ్వరరావు, విశ్వబ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు నరసింహారావు, అధ్యక్షుడు రంగోజు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కందుకూరి మోహన్, కోశాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రిజిస్ట్రేషన్ పట్టాను అందజేస్తున్న స్థల దాత వెంకటేశ్వరరావు

మైలవరంలో పారిశుద్ధ్యం అధ్వానం

డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తచెదారం

మైలవరం: మైలవరంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. డ్రెయినేజీలు చెత్తచెదారంతో పూడుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. మురుగునీరు ముందుకు పారడం లేదు. దోమలు విజృంభిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో తాగునీటి కుళాయిలు కూడా డ్రెయినేజీల్లోనే ఉండటంతో తాగునీరు కలుషితమై వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దీనితో పలువురు మినరల్ వాటర్ కొని తాగుతున్నారు. ప్రతి రోజు మినరల్‌వాటర్ కొని వాడాలంటే ఆర్థికంగా పేదలపై భారం పడుతుంది. గతంలో డ్రెయినేజీల్లో బ్లీచింగ్, సున్నం చల్లించేవారు. కానీ ప్రస్తుతం అటువంటి చర్యలు పంచాయతీ అధికారులు చేపట్టడం లేదు. పంచాయతీ అధికారులు స్పందించి డ్రెయినేజీల్లో పూడిక తీయించి మురుగునీటి పారుదలను సక్రమంగా జరిగేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.



రామకృష్ణ కాలనీలోని డ్రెయినేజీలో పేరుకుపోయిన మురుగు, డ్రెయినేజీ పక్కనే ఉన్న కుళాయి

అటుగా వెళ్లారో.. అంతే!





ఊటవాగు సమీపంలో ప్రమాదకరంగా ఉన్న తారు రోడ్డు మార్జిన్ ; పోతురెడ్డిపల్లిలో పెట్రోలు బంకు ఎదురుగా కోతకు గురైన తారు రోడ్డు మార్జిన్

ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్లు

నూజివీడు: మండలంలోని పలు రహదారుల మార్జిన్లు పూర్తిగా దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. మార్జిన్లు కోతకు గురై నెలలు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోలేదు. ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంపై వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల వచ్చిన వరదలకు నూజివీడు–ముసునూరు మార్గంలో ఊటవాగు వద్ద రోడ్డు మార్జిన్ పూర్తిగా ధ్వంసమైంది. పోతురెడ్డిపల్లి గ్రామంలో చెరువు వద్ద తారు రోడ్డు మార్జిన్ 10 మీటర్ల పొడవునా కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.

రాత్రిపూట భారీ వాహనాలు ఎదురైతే వాటి హెడ్‌లైట్ల వెలుగులో మార్జిన్లు కనపడక ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. ఇప్పటికైనా మార్జిన్లలో మట్టి పోసి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తిరువూరు: తిరువూరు సమగ్ర స్త్రీ, శిశు సంక్షేమ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని స్త్రీ, శిశు సంక్షేమాధికారి సత్యవతి కోరారు. గంపలగూడెం మండలంలోని తునికిపాడు–1 సెంటర్‌లో, పుట్రేల సౌత్ సెంటర్‌లో సహాయకుల పోస్టులు ఖాళీ ఉన్నాయని, ఈ రెండు పోస్టులను ఎస్సీ కేటగిరీకి రిజర్వు చేశారని చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణులైన మహిళా అభ్యర్థులు రెండు సెట్ల దరఖాస్తులతో పాటు సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలను జత చేసి నవంబర్ 5వ తేదీ లోగా తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో స్వయంగా అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు నోటిఫికేషన్ ప్రతులను అన్ని సచివాలయాల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచామని చెప్పారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

తిరువూరు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా స్థాయిలో ఇటీవల నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో తిరువూరు నాగార్జున స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. రెడ్డిగూడెంలో జరిగిన ఈ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు టి. హేమ హన్సిక, సీహెచ్ శ్రీనివాస్, డి. చరితశ్రీలు జిల్లా స్థాయిలో ప్రథమస్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని నాగార్జున స్కూల్ ప్రిన్సిపాల్ నరసింహారావు తెలిపారు. విద్యార్థులను కరస్పాండెంట్ నాగేశ్వరరావు, డైరెక్టర్లు, అధ్యాపకులు అభినందించారు.

ప్రజలపై విద్యుత్ బిల్లుల భారం మోపొద్దు
ఎంసీపీఐయూ నేత ప్రసాద్

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు పేరుతో ప్రజలపై విద్యుత్ బిల్లుల భారం మోపొద్దని ఎంసీపీఐయూ ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యదర్శి గొల్లపూడి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మార్కెట్‌లో నిత్యావసరాల సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని చెప్పారు. ఇప్పుడు విద్యుత్ బిల్లుల బారం వేయవద్దన్నారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు విద్యుత్ చార్జీలు పెంచబోమని ఇచ్చిన హామీని విస్మరించి ప్రజల ఆగ్రహానికి గురికావద్దని హెచ్చరించారు. వినియోగదారులపై భారం వేసే నిర్ణయం విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ ఓట్లు నమోదు చేయించండి: పీఆర్‌టీయూ

మైలవరం: పట్టభద్రులు నవంబర్ 6వ తేదీ లోగా ఎమ్మెల్సీ ఓటర్లుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు పి. గోపాల్ పేర్కొన్నారు. మైలవరంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన అత్యవసర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మైలవరం మండలంలోని వెల్వడం, మైలవరం, చంద్రాల ప్రాంతాల్లోని అన్ని ఉన్నత పాఠశాలల్లో దరఖాస్తులు అందజేశామని చెప్పారు. సభ్యులు అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. పాత యాప్‌లో పలు తప్పులు విద్యార్థుల ఆధార్‌లో ఉన్నాయని, వాటిని సవరించాల్సిందిగా విద్యా శాఖకు విజ్ఞప్తి చేశారు. నవంబర్ 10వ తేదీ వరకు సరిచేసుకునే గడువు పెంచాలని ఆయన కోరారు.